
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 11 అక్టోబరు 2025



స్థాయి మారినా.. సమస్యలు తీరలే
గడ్డపోతారం మున్సిపాలిటీలో కనీస వసతులు కరువు
మురికి కూపంగా అల్లీనగర్ తెలంగాణ కాలనీ
కాజీపల్లి జీఎంఆర్ కాలనీలో తాగునీరు, రోడ్ల సమస్యలు
ఆదాయం పుష్కలంగా ఉన్నా సదుపాయాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం 7

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వ్యక్తిగత వివరాలు అపరిచితులతో పంచుకోవద్దు : సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

పుల్‌కల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, అధ్యాపకులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ దాడులు, ఆన్‌లైన్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ముప్పు, భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫిషింగ్, డేటా దొంగతనం, ఐడెంటిటీ ఫ్రాడ్, రాన్సమ్‌వేర్, సోషల్ మీడియా మోసాలు వంటి వివిధ రకాల సైబర్ నేరాల గురించి ఆయన వివరించారు. శక్తివంతమైన పాస్‌వర్డ్‌లు, టూ ఫ్యాక్టర్ అథంటికేషన్‌ను ఉపయోగించుకోవాలన్నారు. అనుమానాస్పద ఆన్‌లైన్ చర్యలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గుగులోత్ నరసింహ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ భద్రతకు విద్యతో సమానమైన ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. అనంతరం డిజిటల్ ఎథిక్స్, వ్యక్తిగత డేటా రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.రాఘవేందర్‌రావు, ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వి.రజనేష్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ పరితోష్ పంకజ్‌ను ఆహ్వానిస్తున్న జేఎన్టీయూ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

కంది గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్నవారికి
అనుకూల పరిహారం ఇవ్వాలన్న జగ్గారెడ్డి

- వందేళ్ల క్రితం నుంచే కందిలో వారి ఇళ్లు, స్థలాలు ఉన్నాయి
- మానవతా దృక్పథంతో వ్యవహరించి న్యాయం చేయాలని మీడియా ద్వారా కలెక్టర్‌ను కోరిన జగ్గారెడ్డి
- నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులకు స్వయంగా పరిస్థితులపై అవగాహన
- ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదు.. ఉంటే సీఎంతో మాట్లాడేవాడిని
- ఇది ప్రధాని, కేంద్ర మంత్రులు, ఎంపీల పరిధిలో ఉంది
- కంది నిర్వాసితులు నా దగ్గరకు వచ్చినందునే అధికారులనే గ్రామానికి తీసుకొచ్చానన్న జగ్గారెడ్డి
- 1956 భూచట్టానికి ముందే ఇక్కడ ఇళ్లు, స్థలాలున్నాయి

సంగారెడ్డి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముంబయి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కంది గ్రామంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు జగ్గారెడ్డి బాసటగా నిలిచారు. విషయాన్ని ఆయన దృష్టికి తేవడంతో నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులను కంది గ్రామానికి తీసుకొచ్చారు. ఇక్కడి పరిస్థితులపై అధికారులకు అవగాహన కల్పించారు. వందేళ్ల క్రితం నుంచే ఉంటున్న నిర్మాణాలను ఎలా తొలగిస్తారని, ఒకవేళ తొలగించాల్సి వస్తే అనుకూలమైన మంచి పరిహారం ఇవ్వాలన్నారు. ఈమేరకు మీడియా ద్వారా కలెక్టర్‌ను కోరారు. వారికి న్యాయం జరిగేదాకా అండగా ఉంటానన్నారు.


కంది గ్రామంలో జాతీయ రహదారి విస్తరణ నిర్వాసితుల సమస్యలను అధికారులకు వివరిస్తున్న జగ్గారెడ్డి



అంగన్‌వాడీ కేంద్రాల్లో
ఖాళీల భర్తీ ఎప్పుడో?

- సంగారెడ్డి జిల్లాలో 72 టీచర్, 396 ఆయా పోస్టులు ఖాళీ
- పిల్లలకు అక్షరాలు దిద్దించేవారేరీ?
- ఖాళీలతో నెరవేరని సర్కారు లక్ష్యం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. టీచర్ ఉన్న చోట ఆయా లేరు... ఆయాలు ఉన్న చోట టీచర్ లేరు! దీంతో, పోషకాహార పంపిణీ, చిన్నారులకు పూర్వ పాఠశాల విద్యకు సమాయత్తం చేయడంలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఆయాలు మాత్రమే ఉన్న చోట పిల్లలకు అక్షరాలు దిద్దించేవారు లేరు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

జిల్లాలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు

సంగారెడ్డి జిల్లాలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 1,432 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇంకా 72 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 1,108 మంది ఆయాలు పనిచేస్తుండగా 396 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 19,200 గర్భిణులు, బాలింతలు, లక్షకు పైగా చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం తీసుకుంటున్నారు. టీచర్లు లేనిచోట ఆయాలు కేవలం పోషకాహారం మాత్రమే అందించగలుగుతున్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందని ద్రాక్షలా మారింది.

ప్రకటనలకే పరిమితమైన పోస్టుల భర్తీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీ కొన్నేళ్లుగా ముందుకుసాగడం లేదు. అంగన్‌వాడీ టీచర్, ఆయా ఖాళీల భర్తీ ప్రకటనలకే పరిమతం అవుతోంది. అండన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేస్తామని ఏళ్లుగా ఊరిస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ఎనిమిది నెలల క్రితం ఆయా పోస్టుల భర్తీ ఫైలుపై సంబంధిత మంత్రి సంతకం చేసినా.. ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చకపోవడం విమర్శలకు తావిస్తున్నది.



స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌కు బ్రేక్ పడిన మరుక్షణమే అందరి దృష్టి వైన్‌షాపులపైకి మళ్లింది. బరిలో నిలవాలనుకున్న ఆశావహులతోపాటు మద్యం వ్యాపారులు, కొత్త వ్యక్తులు సైతం పునరాలోచనలో పడ్డారు. ఎలాగూ ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేకపోవడంతో వైన్‌షాపులను దక్కించుకోవడానికి సిద్ధమవుతున్నారు. కొత్త షాపులు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తున్నందున ఆ తర్వాతనే పల్లె, పట్టణాల ఎన్నికలు జరుగుతాయనే అంచనా ఉండడమే ప్రధాన కారణం. ఎన్నికల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగితే లాభాన్ని మూటగట్టుకోవచ్చని లెక్కలు వేస్తున్నారు.

ఇక వైన్స్ టెండర్లకు సై

స్థానిక ఎన్నికలకు బ్రేక్.. దరఖాస్తులకు ఊపు

- మద్యం దుకాణాలపైకి మళ్లిన దృష్టి
- శుక్రవారం ఒక్కరోజే 87 దరఖాస్తులు
- కొత్త వైన్‌షాపుల హయాంలోనే ఎన్నికలు
- భారీగా మద్యం విక్రయాలపై అంచనా
- రూ.3 లక్షల ఫీజుకు రెడీ అంటున్న వైనం
- షాపుల బరిలోకి 'స్థానిక' ఆశావహులు

సంగారెడ్డి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :రెండేళ్ల క్రితం జరిగిన మద్యం దుకాణాల కేటాయింపులో దరఖాస్తులు ఎక్కువగా వచ్చిన జిల్లాల్లో సంగారెడ్డి జిల్లా ముందువరుసలో ఉంది. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల ఫీజు నిర్ణయించినప్పటికీ వెనక్కు తగ్గలేదు. నాడు సంగారెడ్డి జిల్లాలో 101 వైన్‌షాపులకు 6,156 దరఖాస్తులు, సిద్దిపేటలో 93 షాపులకు 4,166, మెదక్ జిల్లాలో 49 షాపులకు 1,905 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా కనిపిస్తున్నది. ఇప్పటివరకు నత్తనడకన సాగిన దరఖాస్తులు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నాయి.

పల్లె, పట్టణ ఎన్నికలపై ఆశలు..

తాజాగా హైకోర్టు తీర్పుతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రభుత్వానికి నాలుగు వారాల పాటు గడువు విధించడం, ఆ తర్వాత రెండు వారాల పాటు పిటిషనర్లకు గడువు ఇచ్చినందున మరో 45 రోజుల దాకా ఎన్నికల ప్రస్తావన ఉండకపోవచ్చు. ఈ లెక్కన నవంబరు నెలాఖరు వరకే ఎన్నికలపై స్పష్టత వస్తుంది. అప్పటికప్పుడు నోటిఫికేషన్ విడుదలైనా డిసెంబరు లేదా జనవరిలో స్థానిక, పంచాయతీ ఎన్నికలు ఉంటాయి. ఆ తర్వాత మున్సిపల్

మిగతా 7వ పేజీలో

దరఖాస్తుల వివరాలు

జిల్లా	వైన్స్‌లు	దరఖాస్తులు(14రోజుల్లో)	శుక్రవారం
మెదక్	49	25	26
సంగారెడ్డి	101	133	53
సిద్దిపేట	93	44	08

మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయలక్ష్మి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగూరు ఆనకట్ట వద్ద ఉన్న బూసరెడ్డిపల్లి 100 ఎంఎల్డీ నీటి శుద్ధి కర్మాగారంలో అత్యవసర మరమ్మతు పనుల నిమిత్తం జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని మునిపల్లి, కోహీర్, ఝరాసంఘం, జహీరాబాద్, మొగుడంపల్లి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ, పటాన్‌చెరు మండలాల ప్రజలకు ఈ నెల 11వ తేదీ నుంచి రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా మండలాల ప్రజలు వారి అవసరాల నిమిత్తం సరిపడా నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని సూచించారు. ప్రజలు మిషన్ భగీరథ సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

ఇంద్రేశం మన్సిపల్ వార్డుల విభజన

పటాన్‌చెరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వార్డులను పూర్తిస్థాయిలో విభజించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంద్రేశం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇంద్రేశంతో పాటు రామేశ్వరంబండ, బచ్చుగూడ, ఐనోలు, పెద్ద కంజర్ల, చిన్నకంజర్ల గ్రామాలతో కూడిన వార్డులు విభజన చేయడానికి కసరత్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, సుభాష్, నరేష్, మౌనికారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలతో బోధనకు బ్రేక్

- బెస్ట్ అవైలబుల్ సూళ్ల యాజమాన్యాల నిర్ణయం
- జిల్లాకు రావాల్సిన బకాయిలు రూ. 5,45,39,830
- సర్కారు నుంచి మూడేళ్లుగా విడుదల కాని నిధులు
- యాజమాన్యాల ఎదురుచూపులు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు


సంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్కూళ్ల యాజమాన్యాలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్లల్లో బోధనకు బ్రేక్ పడింది. పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు సర్కారు బెస్ట్ అవైలబుల్ పథకాన్ని తీసుకొచ్చింది. డే-స్కాలర్, రెసిడెన్షియల్ పద్ధతిలో పాఠశాలలు నిర్వహిస్తున్నది. మూడేళ్లుగా సర్కారు నుంచి నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో యాజమాన్యాలు ఇక పాఠశాలలు నడపలేమంటూ చేతులెత్తేశాయి. దీంతో దసరా సెలవుల తర్వాత నుంచి యాజమాన్యాలు విద్యార్థులను అనుమతించడం లేదు. ఫలితంగా ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 14 పాఠశాలలు

సంగారెడ్డి జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పథకం కింద 14 సూళ్లు ఉన్నారు. వీటిల్లో 1808 మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. 1-10 తరగతుల వరకు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. అయితే ఒక్కో విద్యార్థికి ఏడాదికి డే-స్కాలర్‌కు రూ. 28వేలు, రెసిడెన్షియల్ పద్ధతికి రూ. 42వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో పుస్తకాలు, యూనిఫాం, భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారు.

బకాయిల భారం

జిల్లాలోని 14 బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.5,45,39,830 బకాయిలు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇందులో ఎస్సీ శాఖ నుంచి రూ.3,90,20,330 బకాయిలు(2023-24, 2024-25), అదే విధంగా ఎస్టీ శాఖ నుంచి

మిగతా 8వ పేజీలో

ఏకీకృతం ఇంకెన్నాళ్లకు?

ముందుకు సాగని పనులు

- మెదక్‌లో బేస్‌మెంట్ స్థాయిలో నిలిపివేత
- రామాయంపేట, నర్సాపూర్‌లోనూ అసంపూర్తిగానే..
- తుప్పు పడుతున్న నిర్మాణ సామగ్రి
- రూ. కోట్ల ప్రజా ధనం వృథా


నర్సాపూర్‌లో పూర్తికాని ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణం

మెదక్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి గ్రహణం పట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరై పనులు ప్రారంభించినా.. ప్రభుత్వం మారడంతో అర్థాంతరంగా నిలిచిపోయాయి. పట్టణాల్లో కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు ఇలా సమస్తమూ ఒకే మార్కెట్లో లభ్యమైతే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. 2021-22లో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేయడానికి మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. వీటి కోసం పట్టణ ప్రగతి నిధులనూ వినియోగించుకోవచ్చునని జీవోలో పేర్కొంది.


మెదక్‌లో బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన ఏకీకృత మార్కెట్ నిర్మాణ పనులు

రూ. 23 కోట్ల నిధులు

జిల్లాకేంద్రమైన మెదక్ పట్టణంలో రూ. 11 కోట్ల అంచనాతో కోర్టు కాంప్లెక్స్ ఎదురుగా విశాలమైన స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి రూ.6 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. అక్కడ కూడా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మెదక్‌లో బేస్‌మెంట్ లెవెల్ వరకు పనులు చేసిన తర్వాత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడం లేదని నిలిపివేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో, తుప్పు పట్టిన నిర్మాణ సామగ్రితో చిట్టడవిలా తయారైంది. నర్సాపూర్, రామాయంపేటలోనూ పనులు మధ్యలో నిలిచిపోయాయి.

బిల్లులు పెండింగ్


గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలకు జీవో విడుదల చేసినా.. నిధులు చెల్లింపులో మాత్రం వెనకడుగు వేసింది. 2021-22లో మొదలైన నిర్మాణాలకు అప్పట్లో కొంత బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత బిల్లులు పెండింగ్ ఉండటం, అంచనాల సవరణతో పనులు నిలిచిపోయాయి. పట్టణ ప్రగతి నిధులు వాడుకోవచ్చని జీవో పేర్కొన్నా.. ఆ నిధులు కూడా రాకపోవడంతో మార్కెట్ల నిర్మాణానానికి పైసలు కరువయ్యాయి. దీంతో, ప్రారంభంలో ఉత్సాహంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కొద్ది రోజులకు చేతులెత్తేశారు. ప్రస్తుతం నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మార్కెట్ల ఏర్పాటుపై ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి.

సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లోని సాంకేతిక శిక్షణ విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందిస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.


హవేళిఘణపూర్‌లో ఏటీసీని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


శివ్వంపేట వద్ద మంజీరా నదిపై పాత బ్రిడ్జి

సూసైడ్ స్పాట్‌గా మంజీర
- ఆరు వారాల్లో నదిలో దూకిన ముగ్గురు
- మృతదేహంగా ఒకరు.. ఆచూకీ దొరకని మరో ఇద్దరు
- వంతెన వద్ద రక్షణ చర్యలు కరువు
- పట్టించుకోని ఎన్‌హెచ్ఏఐ, పోలీసు అధికారులు 7

వారంపాటు 32 రైళ్లు రద్దు

- వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్
- గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..
- డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతు పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు ఈ నెల 11 నుంచి 18 వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ -డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ, విశాఖపట్నం-న్యూఢిల్లీ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేండ్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జతసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్‌మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.



దొంగతనం జరిగినతీరుపై ఆరాతీస్తున్న సీఐ శివలింగం

ఆలయంలో హుండీ ధ్వంసం

- నగదు, ఆభరణాల అపహరణ

జహీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని భవానమ్మపల్లిలో గల భవానిమాత ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదును అపహరించారు. దసరా నవరాత్రులు ముగియడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఇంకా హుండీ ఆదాయాన్ని లెక్కించలేదని స్థానికులు, పోలీసులు తెలిపారు. ఆలయంలో మూడు హుండీలు ఉండగా, దోపిడీ దొంగలు ఒక హుండీని ఎత్తుకెళ్లారు, మరొక హుండీని అక్కడే పగులగొట్టారు. ఇంకో హుండీ తీయడానికి వీలుకాకపోవడంతో అక్కడే వదిలేసి పోయారు. దీనితో పాటు అమ్మవారి నగలు, ఇతర వస్తువులను కూడా దొంగిలించినట్లు వారు వివరించారు. లెక్కిస్తే దాదాపు రూ.3లక్షల వరకు ఆదాయం ఉన్న హుండీని బట్టి చూస్తే, మిగతా రెండు హుండీలలో సుమారు రూ2 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. వీటితో పాటు వెండితో తయారు చేసిన అమ్మవారి కిరీటం, శఠగోపాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలానికి జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, క్లూస్ టీం సిబ్బంది చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదని, త్వరలోనే పట్టుకుంటామని పట్టణ సీఐ శివలింగం, ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత



పట్టుకున్న బియ్యం లారీ

కల్హేర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి రాజస్థాన్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకుని నారాయణఖేడ్ పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి తమ సిబ్బందితో కలిసి మాసానపల్లి చౌరస్తా సమీపంలో 161 వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా, జీజే 03 బీవీ 2177 నంబరు గల లారీలో బియ్యం బస్తాలను గుర్తించారు. తరలిస్తున్న బియ్యం బస్తాలు ఒకే సైజులో లేకపోవడం, రవాణాకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో అనుమానంతో లారీని పట్టుకున్నారు. లారీని నారాయణఖేడ్ పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించగా, అక్కడ స్థలం లేకపోవడంతో సదాశివపేట గోదాముకు తరలించారు. లారీలో సుమారు 450 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించామని, లోడును ఖాళీ చేయించి లారీని సీజ్ చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిజాంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండల కేంద్రంలోని మల్కచెరువులో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడికి సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతుడు చామన చాయ రంగులో ఉండి, నీలి రంగు ప్యాంటు, నలుపు రంగు డ్రాయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎడమ చేతిపై సూర్యుడు బొమ్మను పోలిన పచ్చబొట్టు ఉన్నందని, ఎవరైనా గుర్తిస్తే నిజాంపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీ యజమానిపై కేసు



శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారులు, వెల్దుర్తి పోలీసులు

వెల్దుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో అక్రమంగా నిల్వ ఉంచిన, అశోక్ లేలాండ్ వాహనం నుంచి కంపెనీలో అన్‌లోడ్ చేస్తున్న రేషన్ బియ్యాన్ని మెదక్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది గురువారం రాత్రి సీజ్ చేశారు. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, స్థానిక ఎస్ఐ రాజు సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం పరిశీలించి, బియ్యం బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ మేరకు శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీ యజమానిపై కేసు నమోదుతో పాటు, రేషన్ బియ్యం తరలింపుకు వాడిన వాహనాన్ని కూడా సీజ్ చేశారు. పట్టుబడిన 35.42 క్వింటాల రేషన్ బియ్యాన్ని వెల్దుర్తిలోని శివసాయి రైస్‌మిల్లుకు తరలించారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని, రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ రాజు సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జూనియర్ అధికారులు నాగరాజు, గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి యువకుడి మృతి



సిలిండర్‌కు అంటుకున్న మంటలు

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాస్ సిలిండర్ పేలి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం... భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో నివాసం ఉంటున్న భాస్కర్ ఇంట్లో గురువారం రాత్రి గ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌ను అమరుస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పడానికి భాస్కర్ కుమారుడు ఆనంద్ స్వరూప్ (22) ప్రయత్నించగా, సిలిండర్ ఒక్కసారిగా పేలింది. గోడ కూలి ఆనంద్ స్వరూప్‌పై పడటంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆనంద్ స్వరూప్(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడు..

మిరుదొడ్డి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో జరిగింది. ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లి రాజు (29) అనే యువకుడు ఈ నెల 6న ఇంట్లో గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున రాజు మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కీర్తన, సంవత్సరన్నర కొడుకు ఉన్నారు. రాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి..

చేగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన పెట్రోల్ పంపు వద్ద మృతి చెందిన ఘటన చేగుంట మండలం బోనాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు చేగుంట పోలీసులు మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. మృతుడి వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు చైన్ స్నాచర్ల అరెస్ట్

- నిందితుల్లో ఒకరు సంగారెడ్డి, మరొకరు మెదక్ జిల్లావాసులు

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బు సంపాదించాలని ఒకరు.. ఇంటి కోసం చేసిన అప్పు కిస్తీ కట్టాలని మరొకరు ఇలా సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన ఇద్దరు.. వికారాబాద్‌కు చెందిన మరొకరు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. వారిని నగరంలోని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి ఏడు తులాల బంగారం, రెండు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు శంకర్‌రెడ్డి బాలగంగిరెడ్డిలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా అన్నారం గ్రామానికి చందిన మస్కూర్ అరుణ్‌కుమార్ ఇల్లు కట్టుకునేందుకు అప్పు తీసుకున్నాడు. కిస్తీలు కట్టేందుకు డబ్బులు లేకపోవడంతో చైన్ స్నాచింగ్‌లు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 3న మెదక్ జిల్లా మద్దూరుకు చెందిన ఇందిర జీడిమెట్ల డిపో వద్ద బస్సు దిగి సూరారం వైపు వెళ్తుండగా, బైక్‌పై వెనుక నుంచి వచ్చిన అరుణ్‌కుమార్ ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు తెంపుకుని పోయాడు. మెదక్ జిల్లా వెల్దుర్తికి చెందిన నేరేడు భూమయ్య (21) పాత నేరస్థుడు. డెలివరీబాయ్‌గా పని చేస్తూ చింతల్‌లో ఉంటాడు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌కు చెందిన మనుశ్రీ ఈ నెల 7న నారాయణాద్రి లే-అవుట్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా, నడుచుకుంటూ వచ్చిన భూమయ్య ఆమె మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు పుస్తెల తాడు తెంపుకుని పోయాడు. అలాగే, వికారాబాద్ జిల్లాకు చెందిన తూళ్ల నీరంజన్‌రెడ్డి డెలివరీ బాయ్‌గా పని చేస్తూ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఈ నెల 7న అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధి సిద్ధి వినాయక నగర్, మచ్చబొల్లారానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు తెంపుకుని వెళ్లాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశారు.

టేక్మాల్ పరిధిలో ఇద్దరు..

టేక్మాల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బంగారు గొలుసు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టేక్మాల్ ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3న సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచిపల్లి గ్రామానికి చెందిన లొద్ది రుక్మిణి పెద్ద శంకరంపేటలోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు బస్ స్టాండ్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన ఆటో ఎక్కింది. ఆ ఆటోలో డ్రైవర్‌తో పాటు ఒక మహిళ కూడా ఉన్నారు. శంకరంపేట వద్ద ఆపకుండా టేక్మాల్ మండలం బోడ్మాట్‌పల్లి వద్ద ఉన్న గుట్ట పక్కన ఉన్న పాఠశాల వద్ద ఆపి, రుక్మిణి కళ్లలో స్ప్రే కొట్టి ఆమె మెడలో ఉన్న తులం బంగారు గొలుసును అపహరించుకొని వెళ్లారు. రుక్మిణి ఫిర్యాదు మేరకు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల సహాయంతో సంగారెడ్డిలో ఉన్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం రత్నపూర్ గ్రామానికి చెందిన పూజారి శ్రీధర్, పూజారి శిరీష అనే భార్యాభర్తలను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నారు. వారిని మెదక్ కోర్టులో హాజరుపరచగా, శిక్ష విధించి సంగారెడ్డి జిల్లా కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిని..

మద్దూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు యువకులు గంజాయి విక్రయాలకు పాల్పడుతూ శుక్రవారం మండలంలోని వంగపల్లి శివారు ఉప్పరోనిగడ్డలో సేవిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై షేక్ మహబూబ్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లాలోని వడ్లకొండ గ్రామానికి చెందిన గడ్డం భువన్, నర్మెట్ట మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన ప్రణయ్‌కుమార్, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లకు చెందిన సోహెల్ కలిసి హైదరాబాద్ నుంచి గంజాయిని తెచ్చి పలువురికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉప్పరోనిగడ్డలో గంజాయి సేవిస్తుండగా, పక్కా సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 106 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

- పోక్సో కేసు నమోదు

జగదేవ్ పూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16)ను ప్రేమించాలని అదే గ్రామానికి చెందిన యువకుడు వెంటపడుతూ లైంగికంగా వేధించాడు. దీంతో ఆమె విషయాన్ని తన తల్లికి చెప్పింది. శుక్రవారం బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. నిందితుడిని సిద్దిపేట భరోసా కేంద్రానికి తరలించినట్లు వివరించారు.

సూసైడ్ స్పాట్‌గా మంజీర

- ఆరు వారాల్లో నదిలో దూకిన ముగ్గురు
- మృతదేహంగా ఒకరు.. ఆచూకీ దొరకని మరో ఇద్దరు
- వంతెన వద్ద రక్షణ చర్యలు కరువు
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు అధికారులు



శివంపేట సమీపంలో మంజీర నదిపై ఉన్న వంతెన

పుల్కల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట సమీపంలోని మంజీర నది వంతెన ఇటీవల సూసైడ్ స్పాట్‌గా మారింది. పోలీసులు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, జీవితంపై విరక్తి వంటి కారణాల వల్ల కొందరు అభాగ్యులు ఈ వంతెన నుంచి మంజీర నదిలోకి దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కేవలం ఆరు వారాల వ్యవధిలోనే ముగ్గురు వ్యక్తులు నదిలో దూకి గల్లంతు కావడం స్థానికంగా కలకలం రేపింది.

ఉధృతంగా నది ప్రవాహం

గత రెండు నెలలుగా కురిసిన భారీ వర్షాలకు సింగూరు ప్రాజెక్టు, మంజీర రిజర్వాయర్‌లకు భారీగా వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో జలాశయాల గేట్లు ఎత్తడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇదే సమయంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై ఉన్న ఆరు వరుసల వంతెనపై నుంచి దూకి గల్లంతవడం ఆందోళన కలిగిస్తోంది. గల్లంతైన వారి ఆచూకీ లభించక, నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడి, బాధిత కుటుంబాలలో తీరని విషాదం నెలకొంటోంది.



రక్షణ చర్యలు కరువు

శివంపేట సమీపంలోని మంజీర నది వంతెన వద్ద కనీస రక్షణ చర్యలు కరువయ్యాయి. జాతీయ రహదారిపై ఉన్న ఈ వంతెనపై నుంచి నదిలోకి దూకకుండా ఉండటానికి, కిందకు దిగేందుకు అవకాశం లేకుండా రైలింగ్ గోడను పకడ్బందీగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వంతెన సూసైడ్ స్పాట్‌గా మారుతున్నా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, పోలీసులు దీనిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వంతెన వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని లేదా, ఎవరూ రైలింగ్ గోడపైకి ఎక్కకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరుస ఘటనలు



మంజీరలో దూకిన మల్లాగౌడ్, లోకచంద్ర, బుడ్డోల్ల మల్లేశం(ఫైల్)

● మద్యానికి బానిసైన శివంపేట మండలానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ ఆగస్టు 29న భార్యతో గొడవపడి మద్యం మత్తులో వంతెనపై నుంచి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 35 రోజుల తర్వాత అక్టోబరు 3న సంగారెడ్డి మండలం గౌడిచర్ల శివారులో కుళ్లిపోయిన అతని మృతదేహం లభ్యమైంది.

● జోగిపేటకు చెందిన క్లింకార యూట్యూబ్ ఛానల్ సీఈవో, రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన లోకచంద్ర, సెప్టెంబరు 30న మంజీర నది వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. సంగారెడ్డిలోని ఓ లాడ్జిలో జరిగిన అనుమానాస్పద మృతి కేసులో రూరల్ ఎస్సై రవీందర్ తనను డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని భార్యకు ఆడియో రికార్డు పంపి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకచంద్ర గల్లంతై 12 రోజులవుతున్నా ఆచూకీ లభించలేదు.

● శివంపేట మండలానికి చెందిన బుడ్డోల్ల మల్లేశం కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఒంటరిగా ఉంటూ జీవితంపై విరక్తి చెందడంతో ఈ నెల 8వ తేదీన నదిలో దూకి గల్లంతయ్యాడు. ముగ్గురు గల్లంతవగా, ఒక్క మల్లాగౌడ్ మృతదేహం మాత్రమే లభ్యం కావడంతో, లోకచంద్ర, మల్లేశం ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు సవాలుగా మారింది. ఈ సంఘటనల దృశ్యాలు ఎన్‌హెచ్‌ఏఐ సీసీ కెమెరాల్లో రికార్డవుతున్నాయి.



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

మంత్రి దృష్టికి నర్సాపూర్ నీటి సమస్య

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం 'నర్సాపూర్‌కు నీటి గోస' శీర్షికన ప్రచురించిన కథనంపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి స్పందించారు. నియోజకవర్గంలోని గ్రామాలకు మంజీర నీటి సరఫరా ఆగిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలు సరఫరా చేసే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ కథనంలో పేర్కొన్నారు. దీనిపై రాజిరెడ్డి వెంటనే స్పందించి, శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌ను కలిసి ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంజీర నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ప్రత్యామ్నాయంగా గోదావరి జలాల పంపిణీకి ఉన్న అవకాశాలను మంత్రికి వివరించారు. సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజల నీటి కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి వివేక్ సానుకూలంగా స్పందించి, వెంటనే ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసినట్లు రాజిరెడ్డి తెలిపారు. మూడు, నాలుగు రోజులలో సమస్య పరిష్కరించి, గోదావరి జలాలను శివ్వంపేట సంపు వరకు సరఫరా చేసి, అక్కడి నుంచి గ్రామాలకు నీరు పంపిణీ అయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారని ఆయన వివరించారు. ఈ కథనం ద్వారా సమస్యను వెలుగులోకి తెచ్చి, పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి రాజిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ బాలికకు కేజీబీవీలో ఆశ్రయం



కాశీపూర్ కేజీబీవీలో భదావత్ మాలిని చేర్పిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు

కంది, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంది మండలం వడ్డెన్నగూడెం తండా పరిధిలోని కొయ్యగుండు తండాకు చెందిన అనాథ గిరిజన బాలిక భదావత్ మాలినిని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అక్కున చేర్చుకున్నారు. వడ్డెన్నగూడెం పాఠశాల ఉపాధ్యాయురాళ్లు జోత్స్న, పద్మావతి, విశ్రాంత మండల విద్యాధికారి, న్యాయవాది అంజయ్యలు ఈ బాలిక పరిస్థితిని జిల్లా అధికారులకు వివరించి, కేజీబీవీ లేదా ఏదైనా గురుకుల పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన జిల్లా అధికారులు శుక్రవారం కంది మండలంలోని కాశీపూర్ కేజీబీవీలో మాలినిని 6వ తరగతిలో చేర్పించారు. బాలికకు వసతి, దుస్తులు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. తాను పెద్దయ్యాక డాక్టర్‌నై పేద ప్రజలకు సేవ చేస్తానని ఈ సందర్భంగా మాలిని చెప్పింది. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అధికారులు సునీత కన్నా, మాధవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు శ్రావణ్ గౌడ్, సబితా, కంది మండల విద్యాధికారి జోగప్ప, కేజీబీవీ ప్రత్యేక అధికారి రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మునిపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం పోతిరెడ్డి జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మునిపల్లి మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలకు చెందిన విద్యార్థి అభినయ్ అండర్ 17 విభాగంలో 55 కిలోల వెయిట్ లిఫ్టింగ్‌లో మొదటి స్థానం సాధించాడు. అలాగే, వినయ్ 52 కిలోల విభాగంలో, వంశీ 45 కిలోల విభాగంలో ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించిన పీడీ స్వాతిని, విద్యార్థులను శుక్రవారం మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మల్లిక అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మెదక్ అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వెస్లీ పాఠశాల మైదానంలో అండర్-17 బాలబాలికలకు నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 18 మందితో కూడిన బాలురు, బాలికల జట్లను ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు వచ్చే నెల నవంబరు మొదటి వారంలో నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.. ఈ కార్యక్రమంలో పీడీలు శ్రీధర్‌రెడ్డి, నగేష్, శ్రీనివాసరావు, రూపేందర్, దేవేందర్‌రెడ్డి, శేఖర్. శిల్ప, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

స్థాయి మరినా.. సమస్యలు తీరలే

- గడ్డపోతారం.. మున్సిపాలిటీగా మారినా సమకూరని వసతులు
- అల్లీనగర్ తెలంగాణ కాలనీలో మురికి కూపాలుగా మారిన రోడ్లు
- కాజీపల్లి జీఎంఆర్ కాలనీలో దశాబ్ద కాలంగా తాగునీటి, రోడ్ల సమస్యలు
- పరిశ్రమలున్నా, ఆదాయం వచ్చినా కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం

జిన్నారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంగా ఉండి, పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా జిన్నారం మండలం గడ్డపోతారంలో అభివృద్ధి మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. మున్సిపాలిటీగా ఏర్పాటయ్యి పది నెలలు గడిచినా, పురపాలక పరిధిలోని కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ వందకు పైగా పరిశ్రమలు, ఏటా మున్సిపాలిటీకి రూ.4 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా, వందల కుటుంబాలు నివసించే కాలనీల్లో కనీస వసతుల కల్పనలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మురుగు కూపంగా తెలంగాణ కాలనీ

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని సర్వే నెం.27లో గల తెలంగాణ కాలనీ గత పదేళ్లుగా కనీస వసతులు లేక మురికి కూపంగా మారింది. ఇక్కడ సుమారు 200 నివాసాలు ఉండగా, కాలనీలోని రోడ్లు పూర్తిగా గోతులమయమై, పిచ్చిమొక్కలు, బురదతో నిండి నడవలేని స్థితికి చేరుకున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నివాసాల మధ్య నుంచే ప్రవహిస్తూ, రోడ్లపైకి చేరుతోంది. దీంతో కాలనీ అంతటా దుర్వాసన వెదజల్లుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసినా, నీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రక్షిత మంచినీరు అందడం లేదు. ఇక్కడ నాలుగు నివాసాల విషయంలో కోర్టు కేసు ఉన్నప్పటికీ, దానిని సాకుగా చూపి మొత్తం కాలనీ అభివృద్ధి పనులను నిలిపివేయడం గమనార్హం. తమ నివాసాలకు రక్షణ కోసమే కోర్టును ఆశ్రయిస్తే, కాలనీ మొత్తానికే అభివృద్ధి నిధులు ఆగిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గడ్డపోతారం మున్సిపాలిటీ తెలంగాణ కాలనీలో నివాసాల మధ్య కనీసం నడవలేని స్థితిలో రహదారి



కాజీపల్లి జీఎంఆర్ కాలనీలో మూడు నెలలుగా రోడ్డుపైనే డ్రైనేజీ ఏర్పాటు కోసం తెచ్చిన పైపులు, ఇటుకలు

తాగునీరు, రోడ్లు లేని జీఎంఆర్ కాలనీ

గడ్డపోతారంలో విలీనమైన కాజీపల్లి పంచాయతీ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో కూడా ప్రజలు కనీస వసతులు లేక దశాబ్ద కాలంగా ఇక్కట్ల మధ్య జీవిస్తున్నారు. 2008లో 450 మందికి, 2023లో 47 మందికి ప్రభుత్వం ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వగా, వారు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ కాలనీలో ప్రధాన రహదారి మినహా మిగిలిన అన్ని అంతర్గత రోడ్లు మట్టివే కాగా, అవి గుంతలమయంగా, మురుగు నీటి ప్రవాహాలతో నిండి ఉన్నాయి. తాగునీటి సమస్య ఇక్కడ తీవ్రంగా ఉంది. రెండేళ్ల క్రితం ఒక పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మించినా, నివాసాలకు పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. ఇక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం నాలుగు నెలల క్రితం రూ.15 లక్షలు మంజూరైనా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు కేవలం పైపులు, ఇటుకలు వేసి పనులు ప్రారంభించకపోవడంతో సమస్య మరింత జటిలమైంది. పారిశ్రామిక ప్రాంతం నుంచి మున్సిపాలిటీగా మారినా, ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే తమ కాలనీల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

పెళ్లైన నాలుగున్నర నెలలకే యువకుడి ఆత్మహత్య



విజయ్ కుమార్ (ఫైల్)

పాపన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లై నాలుగున్నర నెలలకే గిరిజన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండా శివారులో శుక్రవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొడిచన్‌పల్లి తండాకు చెందిన కేతావత్ విజయ్ కుమార్ (32) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసి కొంపల్లిలోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. నాలుగున్నర నెలల క్రితం కౌడిపల్లి మండలం బుజరంపేటకు చెందిన గీతతో అతనికి వివాహం జరిగింది. అయితే పెళ్లి తర్వాత అతను భార్యను ఇంటి వద్దే ఉంచి, తాను ఒక్కడే కొంపల్లిలో ఉంటున్నాడు. ఈ విషయంపై అతని అత్తింటివారు అక్కడ ఉద్యోగం మానేసి, స్థానికంగా ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులు, భార్యతో కలిసి ఉండాలని కోరారు. ఈ మేరకు కౌడిపల్లిలో పీటీఎం స్కానర్ల దుకాణంలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పనిని విజయ్‌కు మార్‌కు అప్పగించారు. కానీ ఈ పని ఇష్టం లేని ఆయన గురువారం ఉదయం పొడిచన్‌పల్లి తండా నుంచి బయటకు వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు, ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వెళ్లే దారిలో, పొడిచన్‌పల్లి తండా అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇక వైన్స్ టెండర్లకు సై

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు జరుగుతాయి. కొత్త వైన్‌షాపులు సైతం డిసెంబరు నెలలోనే ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో ఎలక్షన్ సీజన్ అంతా కూడా తమకు లాభిస్తుందనే ఆలోచనతో మద్యం షాపుల వైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే గ్రామపంచాయతీ, స్థానిక పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో మద్యం విక్రయాలు జోరుగా ఉంటాయి. అందుకే చాలామంది మనసు మద్యం షాపులపైకి మళ్లిందనే చర్చ జరుగుతోంది.

రూ.3 లక్షలైనా రెడీ..

కొత్త మద్యంషాపులకు సంబంధించి గత సెప్టెంబరు 26వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించడం ప్రారంభించారు. అప్పటి నుంచి నెమ్మదిగా దరఖాస్తులు రావడం మొదలైంది. గడిచిన 14 రోజుల్లో అంటే అక్టోబరు 9వ తేదీ వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని 243 వైన్‌షాపులకు 200 దరఖాస్తులు రాగా.. కేవలం శుక్రవారం రోజున 87 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉండడంతో వచ్చే సోమవారం, ఆ తర్వాత శుక్రవారం రోజున భారీగా దరఖాస్తులు వస్తాయని ఆబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొదట్లో రూ.3 లక్షలు అనగానే వెనక్కుతగ్గారని.. ఇప్పుడు సాహసిస్తున్నారని చెబుతున్నారు.



ఆ పోటీ నుంచి ఈ పోటీకి

ఎన్నికల బరిలో నిలవాలనుకున్న చాలామంది ఆశావహులు వైన్‌షాపుల బరిలో నిలుస్తున్నారు. రిజర్వేషన్లు ప్రకటించి నోటిఫికేషన్ కూడా విడుదల చేయడంతో పలువురు ఆర్థిక వనరులను సమకూర్చుకున్నారు. భూములు, స్థలాలు, బంగారం తాకట్టు పెట్టి, విక్రయించి నగదు చేతపట్టుకున్నారు. ఇప్పుడు ఎన్నికలు వాయిదా పడడంతో ఆ సొమ్మును వైన్‌షాపుల వైపు మళ్లించాలని చూస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఐదేళ్లలో సంపాదించే సొమ్ము కంటే ఒక్క వైన్‌షాపు దక్కితే వచ్చే నగదే ఎక్కువ అని భావిస్తున్నారు. రెండేళ్ల కిందట సిద్దిపేట జిల్లాలోని ఓ మద్యం షాపు దక్కిన వ్యక్తికి రూ.70 లక్షల నగదు ఇచ్చి మద్యం వ్యాపారులు స్వాధీనం చేసుకున్నారు. 20 శాతం వాటా కూడా ఇచ్చారు. ఇలాంటి జాక్‌పాట్ తాకితే తలరాత మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారు.

బీసీ రిజర్వేషన్లపై విషం కక్కుతున్న విపక్షాలు

- డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



ఆంజనేయులు గౌడ్

మెదక్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలన్న డిమాండ్ జాతీయ స్థాయిలో మొదలు కావడం బీఆర్ఎస్, బీజేపీలను ఆందోళనకు గురి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయంగా చేపట్టిన కులగణన ఆధారంగా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ అమలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం బీసీ జనాభా ఎంతో స్పష్టత వచ్చిందని, అందుకు తగ్గట్టుగా రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం భావించిందని వివరించారు. ఇప్పటికే దేశంలో పార్టీలన్నీ బీసీ జపం ఎత్తుకున్నాయని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో బీసీ అంశం ప్రధాన ఏ జెండా అవుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రజలు తరిమికొట్టే రోజు వస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిందని, కానీ గవర్నర్ న్యాయ సమీక్ష కోసం కేంద్ర హోం శాఖకు, అటు నుంచి రాష్ట్రపతికి పంపగా ఇప్పటివరకూ ఏలాటి ఆదేశాలు రాలేదని వివరించారు. అసలు బీజేపీ రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో పెట్టి ఉంటే ఈ సమస్యే వచ్చి ఉండేది కాదన్నారు.

ప్రజా పాలనను చూసి కాంగ్రెస్‌లోకి.. : దామోదర్

మునిపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలనను చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బీఆర్ఎస్ నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దామోదర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీలో చేరిన వారిలో ఎండీ.అక్రమ్, ఎండీ.మొహిద్దీన్, గొల్ల రాజు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. రహీం, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు షేక్‌అలీ, కాంగ్రెస్ నాయకులు అశోక్, ప్రేమ్‌కుమార్, అప్సర్ మియా, రషీద్ మియా, ఆబేద్ మియా, దత్తు, బందెల్లి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధుల లేమితో విద్యార్థులకు నష్టం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు అందక ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అన్నారు. సంగారెడ్డిలో శుక్రవారం మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీఇచ్చారని దుర్గా ప్రసాద్ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బుడగజంగం రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, డా.గిరిరాజ్, లింగదాస్, శ్రీశైలం ఉన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి దామోదర్

బాధితులకు అండగా బీఆర్ఎస్ : ఎమ్మెల్యే

జహీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐడీఎస్ఎంటీ బాధితులందరికీ బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పేర్కొన్నారు. న్యాయస్థానం ఉత్తర్వులు, ఆదేశాలను ఆసరా చేసుకుని కొందరు ఐడీఎస్ఎంటీ స్థలం తమదేనంటూ ఇటీవల ఇళ్లను కూల్చివేయడంతో పలువురు బాధితులు ఎమ్మెల్యే ఎదుట బోరున విలపించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ కష్టం చేసుకుని డబ్బులు కూడ బెట్టుకుని అధికారుల, నాయకుల నమ్మకంతో ప్లాట్లను కొనుగోలు చేస్తే ఇదేం సమస్య అని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. పైగా ఐడీఎస్ఎంటీలో గల 150 సర్వే నంబరులో 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని వారు ఎమ్మెల్యేకు వివరించారు. పలువురు అధికారులతో మాట్లాడి ఐడీఎస్ఎంటీ బాధితులకు న్యాయం చేకూరే విధంగా కృషిచేస్తామని ఆయన భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామకిరణ్, బాధితులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మాణిక్‌రావుకు సమస్యను వివరిస్తున్న ఐడీఎస్ఎంటీ బాధితులు

బీరంగూడ రోడ్డులో రూ.150 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి

అమీన్‌పూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీరంగూడ-కిష్టారెడ్డిపేట వంద ఫీట్ల రోడ్డులో రూ.1.50 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జంక్షన్ల అభివృద్ధి పనుల ప్లాన్‌ను అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపే వరకు రూ.68 కోట్లతో రహదారిని వంద ఫీట్లతో నాలుగులైన్లుగా విస్తరించామన్నారు. రహదారిలోని బీరంగూడ సోమవారం సంత, గ్రీన్‌ఫీల్డ్ సిగ్నల్ జంక్షన్, పటేల్‌గూడ డబుల్ బెడ్‌రూం జంక్షన్లను రూ.1.50 కోట్లతో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. గ్రీన్‌ఫీల్డ్ జంక్షన్ వద్ద శివాజీవిగ్రహం, డబుల్ బెడ్‌రూం జంక్షన్ వద్ద మహాత్ముడి విగ్రహాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ వైస్ చైర్మన్ నర్సింహగౌడ్, తహసీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూనాయక్, డీఈ వెంకటమరణ, నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల వారు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి జంక్షన్ల అభివృద్ధి ప్రణాళికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఉచిత న్యాయ సహాయం

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య కోరారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డీ-అడిక్షన్, రిహాబిలిటేషన్ సెంటర్ వద్ద లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి న్యాయ సేవలందించడం ప్రధాన లక్ష్యమన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనానికి గురైన వ్యక్తులు, వారి కుటుంబసభ్యులు, పునరావాసం పొందుతున్న రోగులకు న్యాయ సంబంధ సలహాలు, మార్గదర్శకత్వం చేయనున్నట్టు వివరించారు. ప్రతి శనివారం ఒక ప్యానల్ లాయర్, ఒక పారా లీగల్ వాలంటీర్ క్లినిక్‌లో అందుబాటులో ఉండి సేవలందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల, సూపరింటెంటెండ్ డా.మురళీకృష్ణ, డీఐవో డా.శశాంక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి, ఆర్ఎంవో వీరాంజనేయులు, చీఫ్ డైటీషియన్ బాలస్వామి, న్యాయవాది ఖాలేద్ పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని బాలికల జడ్పీహెచ్ఎస్‌లో న్యాయ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు.


సంగారెడ్డి జీజీహెచ్‌లో మాట్లాడుతున్న సౌజన్య

మానసిక దివ్యాంగుల పట్ల హేళనగా వ్యవహరించొద్దు

శివ్వంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానసిక దివ్యాంగుల పట్ల ఎవరైనా హేళనగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత హెచ్చరించారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక శివ్వంపేట మండలం మగ్దుంపూర్‌లోని మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని సందర్శించి వారితో కాసేపు ముచ్చటించి పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా నిర్వాహకులతో పిల్లల బాగోగులు, అందిస్తున్న ఆహారం, శిక్షణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మానసిక దివ్యాంగులకు ఆధార్‌కార్డు జారీలో ఇబ్బందులు తలెత్తడం వల్ల రావాల్సిన ప్రభుత్వ ఫలాలు అందడం లేదని జడ్జి దృష్టికి నిర్వాహకులు తీసుకెళ్లారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.


పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి హేమలత

బీజేపీ మోసాలను ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి


ఓటు చోరీపై సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎన్నికల సంఘం అధికారులతో కుమ్మక్కై ఓటు చోరీతో చేస్తున్న మోసాలను కాంగ్రెస్ శ్రేణులు గ్రామ గ్రామానికి తీసుకెళ్లి ప్రజల్ని చైతన్యపర్చాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన తన గృహంలో సంతకం చేసి ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలంగా ఉన్నచోట్ల బీజేపీ ఓట్ల చోరీతో అధికారంలోకి వస్తుందన్నారు. కర్ణాటకలో ఒకే ఇంట్లో 80 నకిలీ ఓట్లను తయారుచేయగా.. దేశంలో మొత్తంలో ఇలాంటి మోసాలకు బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ కౌన్సిలర్లు మాజీద్, హన్మాండ్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్‌అలీ, నాయకులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి


అధికారులకు వివరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

నిజాంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. ముందుగా రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు ప్రీతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్జీటీ పోస్టులు తగ్గించొద్దు

● తపస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం

చేగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : హైస్కూల్‌లో పీఈటీ, పీజీహెచ్ఎం పోస్టులను పెంచుతామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తపస్ ఉపాధ్యాయ సంఘం స్వాగతిస్తుందని సంఘం మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం చేగుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఈ కారణంతో ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు తగ్గించడాన్ని తపస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తపస్ మెదక్ జిల్లాశాఖ, తపస్ రాష్ట్ర శాఖ, ఎమ్మెల్సీలు ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని గతంలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశామన్నారు. అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దు, శ్రీధర్‌రెడ్డి, సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ


నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు

నర్సాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కపట ప్రేమ చూపుతూ రాజకీయ లబ్ధిపొందాలనే దురుద్దేశంతో సాధ్యం కాని జీవో తెచ్చి మోసం చేసిందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అని చెప్పి చెల్లని జీవో తీసుకొచ్చి రాజకీయ లబ్ధిపొందాలని కుట్రపూరితంగా వ్యవహరించిందన్నారు. జీవో 9 వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిసి కూడా కోర్టులో అభాసు పాలైందన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి బాదె బాలరాజు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పేరుతో మోసం చేసిన రేవంత్‌రెడ్డి

కంది, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల పేరుతో రాష్ట్ర ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశాడని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై కందిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. బీసీలకు అన్యాయం జరిగితే ఉపేక్షించమని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గిరిధర్ పాల్గొన్నారు.

బీసీలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్

నారాయణఖేడ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ బీసీలకు ద్రోహం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్ అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదనడానికి హైకోర్టు స్టే విధించడమే నిదర్శనమన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీ, బీఆర్ఎస్సే

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందకుండా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుకున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ అన్నారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను జీవో 9 ద్వారా అమలుచేసిన దాన్ని న్యాయస్థానం కొట్టివేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ముఖ్య సలహాదారుడు చంద్రయ్య స్వామి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు నాగరాని తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టి మోసం చేసిన కాంగ్రెస్

హత్నూర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అంబేడ్కర్ సేవాసమితి హత్నూర మండల అధ్యక్షుడు మాచ్కురి శ్రీకాంత్ అన్నారు. గత ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీఇచ్చిన కాంగ్రెస్ నేడు ఆశపెట్టి మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

న్యూస్ బాక్స్

జీవన్‌జ్యోతి బీమాను సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంకులోని ఖాతాదారులు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ వెల్దుర్తి శాఖ మేనేజర్ మధు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన మేకం ఖాశినాదాం వెల్దుర్తి టీజీబీలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి సంవత్సరానికి రూ.436 చెల్లించాడని, అతను అనారోగ్యంతో మృతిచెందడంతో బీమా నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును తల్లి మేకం మణెమ్మ ఖాతాలో జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నీటిశుద్ధి ప్లాంటును మరమ్మతు చేయాలి

తూప్రాన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి 10వ వార్డులో చెడిపోయిన తాగునీటి శుద్ధి ప్లాంటుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరారు. శుక్రవారం ప్రజలు మున్సిపల్ మేనేజర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, బాబు, ఎల్లారెడ్డి, సిద్ధాగౌడ్, సత్యనారాయణ, నాగేందర్‌రెడ్డి, బాబుగౌడ్, ముత్యాలు ఉన్నారు.

మట్టి అక్రమ రవాణాపై స్థానికుల ఫిర్యాదు

జిన్నారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం సర్వే నెంబరు 1 అసైన్డ్ భూముల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు శుక్రవారం తహసీల్దార్ దేవదాస్‌కు ఫిర్యాదు చేశారు. రైతులకు అసైన్డ్ కింద కేటాయించిన భూముల నుంచి అనుమతులు లేకుండా పరిశ్రమలు, ఇతర వాణిజ్య అవసరాల కోసం మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం

కౌడిపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి కొంతకాలంగా రావడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. మురుగు కాలువలు నిండిపోయాయి. చేసేదేమీ లేక గ్రామానికి చెందిన గాండ్ల రమేష్‌తో పాటు మరో పది మంది కలిసి గాండ్ల వాడకట్టులో మురుగు కాలువలను శుభ్రం చేసుకున్నారు.

చదువుతోపాటు ఆరోగ్యమూ ముఖ్యం

నిజాంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సీఐ వెంకటరాజాగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు నార్లాపూర్, కల్వకుంట, రాంపూర్, నస్కల్, చల్మెడ, నందిగామలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఆరోగ్యమే మహాభాగ్యంపై పోలీస్‌శాఖ వారిచే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి : ఏసీడీపీవో

నారాయణఖేడ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాలిచ్చే తల్లులు, గర్భిణులు, కిషోర బాలికలకు పోషకాహారం చాలా అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో సుశీల అన్నారు. మండల పరిధిలోని చాప్టాకె లో పోషన మహోత్సవం, బేటి బచావో...బేటి పడావో కార్యక్రమాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకురాలు మంజుల, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో పలువురి చేరిక

హత్నూర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. రఘునందన్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, హత్నూర మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు మృతి

పుల్‌కల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తలారి లక్ష్మణ్(34) మృతిచెందాడు. ఐదేళ్ల క్రితం చెట్టు పైనుంచి మంచానికే పరిమితమయ్యాడు. ఇటీవల లక్ష్మణ్ ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో గురువారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది చంటి ప్రభు, యువ నాయకురాలు చంటి దేవిక శుక్రవారం గ్రామానికి చేరుకుని లక్ష్మణ్ మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్నీ విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

నిధులిచ్చే వరకు బోధనకు బ్రేక్

(5వ పేజీ తరువాయి)

రూ.1,55,19,500 బకాయిలు(2022 నుంచి 2025) రావాల్సి ఉన్నది. కాగా బకాయిలు విడుదల చేయాలని యాజమాన్యాలు తాజాగా మంత్రి దామోదర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆయా శాఖల జిల్లా అధికారులతో పాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

జూన్ నెల నుంచే

పాత బకాయిలు విడుదల కాకపోవడంతో జూన్ నెలలోనే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులను పాఠశాలల్లోకి అనుమతించ లేదు. దీంతో, విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేయడంతో యాజమాన్యాలు దిగివచ్చాయి. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తప్పని పరిస్థితుల్లో అనుమతించవద్దని బెస్ట్ అవైలబుల్ స్కీమ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తాజాగా తీర్మానించింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసే వరకు విద్యార్థులను యాజమాన్యాలు బడులకు రానివ్వని పరిస్థితి జిల్లాలో నెలకొన్నది. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు చెల్లించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కబ్జాలకు గురైన వాగులను కాపాడండి

● జాగో రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత

జహీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కబ్జాకు గురైన వాగులను కాపాడండని అని జాగో రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత కోరారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటలోగల కబ్జాకు గురైన వాగును, అండర్ బ్రిడ్జిని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వాగులో పూర్తిగా పిచ్చిమొక్కలు పెరగడంతో వర్షపు, మురుగునీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగిస్తే నీరు ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధీర్‌బండారీ, విశ్వనాథ్, నర్సింలు పాల్గొన్నారు.

మురుగు సమస్య లేకుండా చర్యలు


జేపీ కాలనీలో జరుగుతున్న అంతర్గత మురుగు పైపులైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి జేపీనగర్ కాలనీలో జరుగుతున్న మురుగు పైపులైన్, కాలువల నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. మురుగు రోడ్లపై ప్రవహించకుండా ఉండేందుకు బాక్స్‌డ్రైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. లీకేజీలు లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు విద్యార్థి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

తూప్రాన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలుర విభాగం కరాటే పోటీల్లో తూప్రాన్ గీతా స్కూల్ 9వ తరగతి విద్యార్థి అఖిల్‌కుమార్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రతిభచూపి గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని, నవంబరు మొదటివారంలో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అఖిల్ కుమార్ పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయికి అఖిల్‌కుమార్‌ను పాఠశాల కరెస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వర్ అభినందించారు.

వాసవీమాత ఆలయంలో కృత్తిక నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ శివారులో వాసవీ కన్యక పరమేశ్వరిమాత ఆలయంలో శుక్రవారం కృత్తిక నక్షత్ర వేడుకలు నిర్వహించారు. ఆలయ పురోహితులు అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేకాభిషేకాలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన జరిపించి లలిత సహస్ర పారాయణం పఠించారు.

ఈకేవైసీ నమోదును పూర్తిచేయాలి

చేగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈజీఎస్ కూలీల ఈకేవైసీ నమోదును త్వరగా పూర్తిచేసి 2026-27 సంవత్సరానిక మండలంలో పనులు గుర్తించాలని డీఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూలీలకు 100 రోజులు పని కల్పించే విధంగా 2026-27 సంవత్సరంలో మండలంలో పనులు గుర్తించి, ప్లానింగ్ నివేదికను పంపించాలని సూచించారు.

ప్రమాదకర గోడల కూల్చివేత

నారాయణఖేడ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని నెహ్రూనగర్‌లో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గోడలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాలతో శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. ఈ రోడ్డు గుండా ఖేడ్ నుంచి కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ మండలాలతో పాటు పొరుగున ఉన్న కామరెడ్డి జిల్లా, కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డును ఆనుకునే ఉన్న పలు గృహాలు శిథిలావస్థకు చేరి గతంలోనే కూలిపోగా గృహాల వారు ఖాళీ చేశారు. రోడ్డు వైపు ఉన్న గోడలను శుక్రవారం కూల్చేశారు.

బాధితులకు బాసటగా సీఎం సహాయనిధి

జహీరాబాద్/నారాయణఖేడ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి బాధితులకు బాసటగా నిలుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో గల ఆయన గెస్ట్‌హౌజ్‌లో న్యాల్‌కల్, తదితర మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.2.50 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌వోసీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, నాయకులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ మండలం శాంతినగర్ తండాకు చెందిన శోభారాణికి రూ.19,500, పెద్దశంకరంపేటకు చెందిన రహీమొద్దీన్‌కు రూ.12 వేల సీఎం సహాయనిధి చెక్కులను టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, జిల్లా ప్రణాళిక మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ అందజేశారు.

మురుగునీటితో విద్యార్థుల కష్టాలు

మనోహరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం చెట్లగౌరారం గ్రామంలోని మురుగునీరు రోడ్డుపై వదిలేయడంతో రంగాయపల్లి గ్రామ శివారులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ చేరింది. దీంతో మధ్యాహ్న సమయంలో విద్యార్థులు మురుగు వాసనతో భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ చేరిన నీటిని తొలగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.